**'వేడి' అన్నది పదార్థానికయినా ప్రాణికయినా జీవలక్షణం. అటువంటప్పుడు వేడి 'రుచి' కావచ్చు జీవితంమీద అభిరుచి కావచ్చు.**

**ఆ**యిదవుతోంటే యింటికి పోదామనిపించింది రాజశేఖర్‌కి.

టేబిల్ నిండా ఫైల్సు వున్నాయి. ఉదయంనించీ వొచ్చేవాళ్ళూ పోయేవాళ్ళూను— దానితో పని పెరుకుపోయింది. ఈగల్లాగ ముసురుకున్నాయి ఫైళ్ళు. రోజూకన్నా అవ్యాయంగా వుందివేళ....

లేచి నిలబడి వొళ్ళు విరుచుకుని గదిచుట్టూ చూసి మళ్ళీ కూర్చుని ఒక ఫైల్ చేతిలోకి తీసుకున్నాడు శేఖర్.

అరగంటసేపు కొన్ని ఫైళ్ళుచూసి సంతకాలుపెట్టి ట్రేలో పడేశాడు. ఇంకో ఫైలు తియ్యబోతోంటే టెలిఫోన్ మోగింది.

అవతల సారథి మాట్లాడుతున్నాడు.

"బ్రదర్! ఈ రోజు నువ్వు నా ఇంటికి వొచ్చితీరాలి" అన్నాడు ఉపోద్ఘాతం లేకుండానే సారథి. అతనికి విచిత్రమైన అలవాటు - అయితే చాంతాడంత ఉపోద్ఘాతం ఇస్తాడు. లేదా ఇలాగ మాటా మంతీ లేకుండా అసలు విషయానికి వొస్తాడు.

"చూడు సారథీ!.... నేను ఏదో ఒక రోజు వొస్తానుగా!...." అన్నాడు ఆలోచన సాగిస్తూ శేఖర్. ఏ సాకు చెప్పాలో అతనికి తొందరగా తెలియడంలేదు.

"తప్పకుండాను. ధర్మపత్నితో సహా. త్వరలో. దానికి మెనీ మెనీ హాపీ రిటర్న్స్!.... అది సరేగానీ, ఇంటికి ఎప్పుడు చేరుతావు?" అన్నాడు సారథి.

"ఇంకో అరగంటలో... టేబిల్ నిండా ఫైల్స్ వున్నాయి" అన్నాడు శేఖర్.

"టేబిల్ నిండా కాగితాలూ, మనసు నిండా మా మరదలూనూ" అన్నాడు సారథి నవ్వుతూ.

అప్పుడు శేఖర్‌కి ప్రియ జ్ఞాపకం వచ్చింది.

అతనికామె అస్తమానమూ జ్ఞాపకం వస్తూనే వుంటుంది. కాని, ఆ జ్ఞాపకాలని అతను కాగితాల వెనక్కి తోసేసి, పనిలో నిమగ్నమైపోతాడు. నిజానికి ఆమెని 'ప్రియా' అనిపిలవడంకూడా ఇంకా అలవాటు కాలేదు! ప్రియంవద ఆమె అసలు పేరు. కాని ఆమెతో గడిపినవి మూడే మూడు రోజులు. వాటిలో సగంకన్నా తక్కువ ఏకాంతంగా. ఆ కొద్ది గంటల లోనూ మాటాడినది తక్కువ. ఆ మాటల్లో పిలుపులు మరీ తక్కువ. ఈ క్షణంలో ఏం చేస్తోందో! రేపు వాళ్ళ పెత్తల్లిగారి అమ్మాయి పెళ్ళికదా! ఆ గొడవలో పడి తనని మరిచిపోయే వుంటుంది. ఉత్తరంలో రాసిందిగాని—

"ఏం అమ్మాయి పేరు వినగానే ఆలోచనలో పడ్డావా?" అన్నాడు అటునించి సారథి నవ్వుతోనే.

"అవును" అన్నాడు శేఖర్. అతనికీ, సారథికీ మధ్య అరమరికలు ఎప్పుడూ లేవు. పదిహేనేళ్ళ స్నేహం వాళ్ళది.

"గుడ్. లేదని అంటే నీకు చాలా పెద్ద శిక్ష వేసేవాడిని!.... అదిసరేగానీ ఎన్ని గంటలకి వొస్తావు?" అన్నాడు సారథి.

"చూడు సారథీ! ఈ రోజుకి వొది లెయ్యి. చాలా పని వుంది. కనీసం ఇరవై ఫైళ్ళయినా ఇంటికి తీసికెళ్ళక తప్పదు.. అయినా-" అన్నాడు శేఖర్.

"అయినా .... వారం రోజుల వైవాహిక జీవితంలోకి నీకు రావాలని లేదు!" అని అతని మాటల్ని పూర్తిచేశాడు సారథి.

"అవును ... నిజానికి- నాకు ...."

"మరేం బెంగపడకు. అంత ఘాటు ప్రేమ ఇంకా అంకురించలేదు.. అన్నట్టు నీ కారు గరాజీ నించి వొచ్చిందా?" అన్నాడు సారథి.

"లేదు."

"నీ జాతకం అలాంటిది శేఖర్! పెళ్ళయినా ఇంట్లో ఇల్లాలు లేదు. అన్ని వేలు పెట్టికొన్నా వుపయోగానికి వాహనంలేదు" అన్నాడు సారథి.

అది నిజమేననిపించింది శేఖర్‌కి.

"చూడు శేఖర్! సరిగ్గా ఏడుకి వస్తాను. రడీగా వుండు" అన్నాడు చివరి మాటగా సారథి.

"నువ్వు రావొద్దులే! ఒక్క కిలోమీటరు నడిచి రాగలను" అన్నాడు శేఖర్.

"సరే నడిచే వస్తావో. సరిగ్గే వస్తావో! ఏమీ కొట్టకుండా రా...." అని డిస్కనెక్ట్ చేశాడు సారథి.

చిరునవ్వుతో మరో ఫైల్ తీశాడు శేఖర్. తనూ సారథిలాగా ఇంజనీర్ అయితే బాగుండును అనిపించిందతనికి.

కాగితాల మీద మనసు పోలేదతనికి. ప్రియమీద మనసు పోయింది.

ఆమె రాసిన వుత్తరం మీదకి పోయింది.

ఆ వుత్తరంలో ప్రతీ అక్షరమూ అతన్ని గిలిగింతలుపెటి వెచ్చగా మధురంగా యెక్కడెక్కడికో తీసుకుని వెళ్ళిపోయింది. ఆ ఉత్తరం యెన్నిసార్లు చదివేడో!....మూడు పేజీల ఉత్తరంలో సగానికిపైగా వెచ్చటిమాటలూ, వేడివేడి తలపులూను.

"ఏమండీ! మీ దగ్గరకి యెప్పుడు వొచ్చేద్దామని ప్రతీక్షణమూ లెఖ్ఖ కడుతూ వుంటానండీ! పెళ్ళికి వుండాలనిలేదు. వొచ్చి మీ గుండెలమీద వాలిపోవాలని వుంది. ఆ మాట అనాలని యెన్నిసార్లో సిద్ధపడి మా వాళ్ళకి చెప్పలేకపోయానండీ. ఇప్పటికే అందరూ నా పరధ్యానంచూసి ఆట పట్టిసున్నారు. రోజూ యెన్నిసార్లో యెవరో ఒకరు నా మీద ఒక విసురు విసురుతూనే వుంటారు. నా కోరిక బయట పెడితే అమ్మో! ఇంకేమైనా వుందా?...."


మన మధ్య ఈ యెనిమిది వొందల కిలోమీటర్ల దూరం తలుచుకుంటే మతిపోతూ వుంటుంది. మీకు యెంత దగ్గరగా వుండాలో అంత దూరంగా వున్నానని బెంగపడిపోతాను. ఎంత వొద్దన్నా ఆ మూడు రాత్రులూ జ్ఞాపకం వొస్తూనే వుంటాయి. ఆరోజు మీకు జ్ఞాపకంవుందా? నేను గదిలోకి రాగానే మీరు...."

అలాగ రాసింది. ఆ తరవాతవి వెచ్చగా కాదు. వేడిగా రాసింది.

వేళ్ళు లెక్కపెట్టుకున్నాడు. ప్రియ వచ్చి తన కలలు నిజం కావడానికింకా

# వేడికాదా ఒకరుచే!

ఇచ్ఛాపురపు జగన్నాథరావు



ఆరు రోజులున్నాయి.

అతని ఆలోచనలని ఆమె పూర్తిగా ఆక్రమించేసరికి శేఖర్ ఇంక ఆ గదిలో ఉండలేకపోయాడు. ఫైళ్ళన్నీ కట్ట కట్టించి కారులో ఇంటికి చేరుకున్నాడు.

నాయర్‌ని చూడగానే వంటమనిషి మాట జ్ఞాపకం వచ్చింది. రేపైనా నలుగురికి చెప్పి మనిషిని పెట్టుకోవాలి. ప్రియ వచ్చేక ఆమెకి ఇబ్బంది వుండకూడదు.

నాలుగేళ్ళనించి నాయర్ తనకీ, సారధికీ వండి పెట్టేడు. వంట ఒక్కటే కాదు. తమ మంచి చెడ్డలన్నీ చూసుకునే బాధ్యత తనమీద వేసుకున్నాడు. కాని, అతనికి జీవితంలో పెద్ద నియమం వుందిట— పనిలో చేరుతూనే చెప్పేడు. పెళ్ళయి, సంసారాలు చేస్తూన్న వాళ్ళ ఇంట్లో అతను పని చెయ్యడుట. అందుకే సారధి పెళ్ళి ముందరే వేరే ఇల్లు తీసుకుని పనిమనిషినీ వంటమనిషిని ఏర్పాటు చేసుకున్నాడు.

స్నానం చేసి బట్టలు వేసుకుని బయలుదేరుదామనుకుంటూంటే సారధి వొచ్చాడు.

"నువ్వెందుకొచ్చావు?.... నేను నడచి వొస్తానుకదా!" అన్నాడు శేఖర్.

"అలాగేలే.... కావాలంటే నా కారు వెనక పరుగుపెట్టు. కానీ, క్విక్‌గా ఒక డ్రింక్ ఇయ్యి...." అంటూ సారధి నాయర్‌ని కేకవేశాడు. నిమిషంలో రెండు స్కాచ్‌లు - సారధికి నీళ్ళతోనూ శేఖర్‌కి సోడాతోనూ తయారుచేసి, ఐస్‌క్యూబులు అతనికి రెండూ. ఇతనికి మూడూ వేసి తెచ్చిఇచ్చి. "బాగా వున్నారా సార్?" అన్నాడు.

డ్రింక్ సిప్ చేసి. "బాగానే వున్నాం నాయర్! - ఒకనాడు వొచ్చి చూడు" అన్నాడు సారధి.

"అలాగే సార్!" అన్నాడు నాయర్.

"అలాగే అంటావుగాని రావులే" అన్నాడు సారధి నవ్వుతూ.

"మనిషి బాగా వంట చేస్తుందా సార్" అన్నాడు నాయర్ అభిమానంగానే. మాట మారుస్తూ.

"వంట మనిషి లేదు నాయర్! వచ్చిన మర్నాడే వెళ్ళిపోయింది" అన్నాడు సారధి.

ఎందుకని అడగలేదు. అతను అడగడు. అతనికన్నీ తెలుసును. విచారంగా తల ఊపి లోపలికి వెడుతూ "చిప్స్ నిమిషంలో తెస్తాను" అన్నాడు.

"వద్దు" అన్నాడు సారధి. ఆశ్చర్యంగా ఒకసారి చూసి నాయర్ వెళ్ళిపోయాడు. సారధికి చిప్స్ అంటే చాలా చాలా ఇష్టం.

"ఏం?" అన్నాడు శేఖర్.

"అక్కడ లావణ్య నలుగురికి యెక్కువయ్యేంత వొంట చేసింది. అలా చూడకు. మూడునించి ఆమె వంట మొదలుపెట్టింది."

"గాడ్!"

"గాడ్ అంటూ వుంటే మన మిద్దరం ఆమె తృప్తిపడేలాగ భోజనం చేసేశక్తి యివ్వాలని ప్రార్థించు...." అంటూ మరో రెండు సిప్స్ త్వరత్వరగా తీసుకున్నాడు సారధి. అదీ అతనికి అలవాటులేని పని

"అసలుసంగతి చెప్పు" అన్నాడు శేఖర్.

గ్లాసు ఖాళీచేసి మరో డ్రింక్ తయారు చేసుకుని "బ్రదర్! నీకు కాకపోతే యెవరికి చెప్పేది? మా లవ్-అదే లావణ్య. ఆమెని పూర్తి పేరుతో తప్ప యింక యెలాగా పిలవకూడదుట. చూడూ-లవ్! అంటే తప్పా?...." అన్నాడు.

శేఖర్ చిరునవ్వుతో జవాబిచ్చేడు. అతి చిన్న విషయాలకి ప్రాముఖ్యత యివ్వడం సారధికి అలవాటే. అదీకాక అతనికి మొదటిసారి తన భార్యని 'ప్రియా' అని పిలిచినప్పుడు ఆమె బుగ్గలు ఎరుపు కావడం. కళ్ళలోకి అందమైన కాంతి రావడం జ్ఞాపకం వొచ్చింది.

"నవ్వు! నవ్వు!.... నీకేం తెలుసును?.... ఆవిడ నాకు ఒకే ఒక ఉత్తరం రాసింది. అదీ, నేను రాయమని టెలిఫోన్ చేసేను. పూజ్యులైన శ్రీవారికి. అని ప్రారంభించింది. ఆ ఉత్తరం నీకు చూపెడదామనుకున్నాను "

"సిలీ ఫెలో" అన్నాడు శేఖర్.

"నీకేకాదు - నాలుగు పత్రికల్లో అచ్చు వేయించినా చదివిన ఏ చిట్టితల్లీ కూడా ఏమీ అనుకుని వుండదు. పుతికి ఇస్త్రీ చేసినంత కీన్‌గా వుంది. ప్రేమ అనే రెండక్షరాలూ లేవుకదా. అలాటి దురాలోచన కూడా లేదు ఆ ఉత్తరంలో. నయం మేమూ నీలాగే కరెస్పాండెన్స్ ప్రేమలో పడితే నాకేమీ మిగిలేదికాదు. అన్నటు - ప్రియం వద రాసిందా?" అన్నాడు సారధి.

చిరునవ్వుతో అవునన్నాడు శేఖర్.

"కవరు చేతిలోకి రాగానే ఐసు ముక్కలు పట్టుకున్నట్టు లేదుకదా?" అన్నాడు సారధి, సగం గాంభీర్యంతో.

"లేదు "

"గుడ్. నువ్వెంత అదృష్టవంతుడివో నీకు తెలీదు....నా తత్వం నీకు తెలుసుగా .. ఆమె....అదే.... లావణ్య అప్పుడే ఫ్రిజ్‌లోనించి బయటికి తీసినట్టు ఉంటుంది.... దేనికీ ఉద్రేకపడదు .. "

హఠాత్తుగా ఆగిపోయాడు సారధి

శేఖర్‌కి కొంచెం బాధ కలిగింది. సారధి చాలా ఉత్సాహమైన మనిషి. అతను లావణ్యని చూసి వొచ్చి ఆమెను గురించి కన్నకలలు అతనికి తెలుసును. ఆమెని ముద్దుగా "లవ్" అని పిలవాలనీ.... ఏమో ఏమో....

"క్రమంగా మార్పు వొస్తుందిలే-కొంతమందికి ఈ సంసార జీవితం అలవాటు కావడానికి వ్యవధి కావాలి" అన్నాడు సానునయంగా శేఖర్.

"థాంక్స్ బ్రదర్! కాని అలాటి ఆశ ప్రతి రాత్రీ తగ్గిపోతోంది" అని వాచీ చూసుకుని "పది ఆమె ఆరువించీ వెయిట్ చేస్తోంది" అని గ్లాసు ఖాళీ చేసి లేచాడు. శేఖర్ కూడా అతని వెనకాలే బయలుదేరాడు.

వంట మనిషి లేదన్నమాట విన్న దగ్గర నుంచీ శేఖర్ కొంచెం భయపడ్డాడు. అతనికి రుచులు ఎక్కువ. ప్రతీ పూటా భోజనం ఎలాగ వుండాలో ఏది ఎలాగ వండాలో నాయర్‌కి చెప్పడం అతనికి దినచర్య. అక్కడ లావణ్య పాకశాస్త్రంలో ఎలాటి ప్రయోగాలు చేసిందో! ఈ రోజు అసలే ఆకలిగా వుంది. కడుపులో స్కాచ్ కలవరపెడుతోంది.

నాలుగు నిమిషాలలో ఇల్లు చేరారు. డ్రాయింగ్‌రూంలో ఇద్దరూ కూర్చున్నాక సారధి లావణ్య కోసం కేక వేశాడు "వస్తున్నానండీ" అని చిన్నగా జవాబిచ్చి మరో పది నిమిషాలకి వచ్చింది ఆమె.

కంచి పట్టుచీర, తలలో పువ్వులు.... కొత్తగా కాపురానికి వొచ్చినట్టు లేదు లావణ్య.

అతను ఏమో అనేలోపునే, "నమస్కారమండీ! మీరు రాలేదని ఆయన ప్రతిరోజూ బాధపడుతున్నారు. ఇవాళ వొచ్చారు సంతోషం" అంది కూర్చుంటూ.

"పని అలాగ వుందిలెండి .."అన్నాడు శేఖర్. ఆమెని గురించి యిందాక సారధి చెప్పినది జ్ఞాపకం వొచ్చింది.

"రాత్రికూడా చేసే పనా మీది?" అంది లావణ్య చిరునవ్వుతో. ఆమెకూడా ప్రియంవదలాగ కాకపోయినా చాలా చక్కగా వుంటుంది అనుకున్నాడు శేఖర్. అప్పుడే స్నానంచేసి వొచ్చినట్టు తాజాగా వుంది. ఇందాక సారథి అన్నమాట "ఫ్రిజ్‌లో నించి తీసినట్టు" నిజమే ననుకున్నాడు.

"అది కాదులెండి...." అని నవ్వేగాడు శేఖర్.

"అతనికి మొహమాటం లావణ్యా! ఇవాళ రమ్మంటే లెక్చరివ్వబోయాడు యివ్వనివ్వలేదులే!" అన్నాడు సారధి.

"ఇంక వారంలేదు. ఆవిడా వొస్తారు. ఈ వారం యిక్కడే భోజనానికి రండి" అంది లావణ్య. చాలా ఆప్యాయంగా చెప్పింది.

"వారమంతా మీకెందుకు శ్రమ?.... అసలు రెండు మూడుసార్లు మీరిద్దరూ రండి నాయర్ సంతోషిస్తాడు" అన్నాడు శేఖర్.

"వంటవాళ్ళు ఏంచేసారండీ? ఇన్నాళ్ళూ మీకు తప్పలేదు. ఇంకో వారానికి మీ ఆవిడ ఎలానూ వొస్తారు...."

"వారం కాదు-ఆరు రోజులే" అన్నాడు శేఖర్.

సారథి హాయిగా నవ్వి. "రోజులు లెక్కలు పెడుతున్నావన్నమాట... గుడ్ బాయ్!" అన్నాడు.

లావణ్య కూడా అందంగా నవ్వింది.

"భోజనానికి లేస్తారా?" అంది మరో పది నిమిషాల తరువాత. ఆమె చెప్పే కబురు కూడా గంభీరంగా వున్నాయి.

"నీకు అభ్యంతరం లేకపోతే- ఒక్క రౌండు వేసుకుని వస్తాను" అన్నాడు సారధి.

"అక్కడ-అదే శేఖర్‌గారి ఇంట్లో అవలేదా?" అంది లావణ్య.

"మొదలుపెట్టేము. ఇక్కడ ముగిస్తాము."

"మీ ఇష్టం.... వంట అంతా అయిపోయింది " అంది లావణ్య.

సర్వెంటుని కేకవేసి సరంజామా తెప్పించుకుని. లేచి వెళ్ళబోతొన్న లావణ్యని ఆపేడు సారధి.

"నువ్వూ కూర్చో" అన్నాడు.

"కొంచెం పని వుంది. మళ్ళీ వను మీరు త్వరగా ఫినిష్ చెయ్యండి కాకరకాయ మసాలా ఆయనకి ఇష్టమన్నారని చేశాను" అంటూ వెళ్ళిపోయింది లావణ్య. సారధి గడియారం చూశాడు.

హతవిధీ! అనుకున్నాడు శేఖర్. ఆ కూర నాయర్ చేసినట్టు ప్రపంచంలో ఎవరూ చెయ్యలేరని అతనికి తెలుసును. ఈ డ్రింక్ వేడిలో తినాలిగాని, కాకపోతే ఈ రోజు చాలా కష్టం అయి ఉండేది అనుకున్నాడు.

ఎనిమిది దాటుతోంటే భోజనాలకి కూర్చున్నారు ఇద్దరూ. ఎంత బలవంతం చేసినా లావణ్య వాళ్ళతో కూర్చోలేదు. వడ్డన తనకి సరదా అంది.

రెండు కూరలు, గోంగూర పచ్చడి కాకకందిపచ్చడి. సాంబారు, రసం, వడలు, పాయసం.

భోజనం అంతా చల్లగానే వుంది. సాంబారు కూడాను కాని, రుచి చూడగానే శేఖర్ ఆశ్చర్యపడ్డాడు. చల్లారిపోయినా వంట చాలా బాగుంది. చాలా ఎక్కువగా తిన్నాడు. లావణ్య వడ్డన చేస్తోనే వుంది. అతను తింటూనే వున్నాడు. కాకరకాయ విషయంలో నాయర్ కూడా ఎందుకూ పనికిరాడు అనిపించింది.

ఆ భోజనమే వేడిగా వుంటే!.... అనే

ఆలోచన రెండు మూడు సార్లు వొచ్చింది శేఖర్‌కి. అయినా అతను చాలా సంతృప్తిగా తిన్నాడు.

"సారధీ! యు ఆర్ వండర్‌పుల్లీ లక్కీ!" అన్నాడు నిండిపోయిన కడుపు లోంచి తెలుగులో సరియైన మాటలురాక.

"అవును" అన్నాడు సారధి. అతనూ బాగా తిన్నాడు

"లావణ్యగారూ! మీ చేతివంట ఇప్పటి దాకా రుచి చూడలేకపోవడం నా దురదృష్టం!.. ఇంత గొప్పగా మీరు వంట చేస్తారని సారధి కూడా చెప్ప లేదు!" అన్నాడు ఆమెకు ధన్యవాదాలు చెప్తూ.

"ఆయన అసలు సరీగా తినరు.... ఉదయం పోనీ ఆఫీసు తొందర అనుకుంటే రాత్రి తినడానికేం? ..ఆయన చిక్కిపోతే మా అత్తగారు నన్ను సంజాయిషీ అడుగుతారు" అంది లావణ్య.

"మీచేతి వంట తింటే చిక్కిపోడం ఉండదులెండి థేంక్స్!—ఈసారి నేనే వొస్తాను" అన్నాడు మనసారా శేఖర్.

లావణ్య సంతోషంగా, "అలాగే చెయ్యండి... ప్రియంవద రాగానే మొదటి మూడు నాలుగు రోజులూ యిక్కడికే రావాలి!" అంది.

"అలాగే!" అన్నాడు శేఖర్ లాంఛనంగా. ఆ సాయంత్రాలూ, వయసురాని రాత్రులూ లావణ్య చేసిన డైనారే-భోజనంకోసం వృధా చెయ్యడం అతని ప్రణాళికలో లేదు కాని.

"పద. సగం దూరం నీతో నడిచి వొస్తాను" అన్నాడు సారధి. ఇద్దరూ బయటికి రాగానే "ఆమె అద్భుతంగా చేసింది వంట ఎప్పుడూ నేనంత తినేదు" అన్నాడు శేఖర్.

"అవును... కాస్త వేడిగావుంటే యింకా బాగుండేది...."

"కష్టంకదా!...."

"అవున్లే. కాని నీకు తెలుసుగా! నాకన్నీ వేడిగా వుండాలి. నాయర్ యెలాగ సాధించేవాడో, బయట వర్షం పడుతున్నా వడ్డన చేసేసరికి ప్లేటులో వించి ఆవిరి వచ్చేది" అన్నాడు సారధి.

సగం దూరం వచ్చి వెనక్కి వెళ్ళేడు సారధి.

శేఖర్ ఇంటికి చేరుకున్నాడు.

ఆలొచనల్లో చాలాసేపు గడిపి నిద్ర పోయాడు. ఇంకా ఆరు రాత్రులిలాగ గడపాలనే బాధ అతనికి నిద్రని కొంత దూరం చేసింది.

ఆ తరవాత నాలుగైదు రోజుల్లోనూ అతను వంటమనిషి కోసం ప్రయత్నించేడు కాని, ఎవరూకుదరలేదు. నాయర్‌తో చివరిరోజు మాట్లాడేడు- కొంచెం రోజులు వుండమన్నాడు.

"మీరేం చెప్పినా చేస్తాన్సార్! కాని.... అమ్మగారు వచ్చేక వుండమని మాత్రం అనకండి. మీకు కాదనడం నాకు బాగుండదు" అన్నాడు నాయర్.

అతనెప్పుడూ చెప్పలేదుగాని ఎక్కడో ఏదో పెద్ద సంఘటన జరిగి వుంటుందని శేఖర్‌కి తెలుసును. ఆ విషయం గురించి నాయర్ మాట్లాడనీ అతనికి తెలుసును.

రేపు సాయంత్రం ప్రియంవద వస్తుందనగా నాయర్ సామాన్లు సర్దుకున్నాడు. ఆమె వొచ్చే వుదయమే అతను శేఖర్‌కి గుడ్‌బై చెప్పి, అతనిచ్చిన డబ్బు తీసుకుని, కలనల్ కపూర్ ఇంటికి వెళ్ళిపోయాడు. కలనల్‌గారికి పిల్లలు లేరు. భార్య పోయింది. రిటైర్ అయి ఈ మధ్యనే అక్కడ సెటిల్ అయాడు.

వారం పది రోజులెలాగో సరిపెట్టుకోవొచ్చులే అనుకున్నాడు శేఖర్. ప్రియంవద కూడా లావణ్యలాగ పాకశాస్త్రంలో ప్రవీణ అయి వుండవొచ్చును....

ఏడు గంటలకి వొచ్చే రైలు కోసం ఆరున్నరకే స్టేషనుకి చేరుకున్నాడు శేఖర్- అదృష్టంకొద్దీ ప్రియంవద వొంటరి

మీ కేశ సౌందర్యాభివృద్ధికి కొబ్బరినూనె కంటె అతి ఉత్తమమైనదేది?

# కేశవర్ధినిని

చేర్చిన కొబ్బరినూనె

OBM 6119/TG




ఔను! మీరు ప్రతి నిత్యమూ తలకు రాసుకుంటూన్న కొబ్బరినూనెలో కొన్ని చుక్కలు కేశవర్ధినిని కలపండి. తల చర్మానికి అంటేటట్టుగా తలకు రాసుకోండి. ఇదే అందంగా తల వెంట్రుకలు పెరగడానికి సాంప్రదాయిక రహస్యము- కేశవర్ధిని. వెంటనే ఒక బాటిల్ కేశవర్ధినిని కొని వాడండి.




కేశవర్ధిని ప్రొడక్ట్స్
మద్రాసు-600 087

గానూ రైలు నాలుగునిమిషాలు ముందరా వొచ్చింది.

కూడా వొచ్చిన డ్రైవర్‌కి సామాన్లు అప్పజెప్పి ప్రియంవదతో స్టేషన్ బయటికి నడిచాడు శేఖర్. ఓవర్‌బ్రిడ్జి మీద నడుస్తూ ఆమెకి చెయ్యి అందించాడు — ఆప్యాయంగా పట్టుకుని అతన్ని అనుసరించింది.

"అలిసిపోయావా ప్రియా?" అన్నాడు ఆమెకే వినిపించేటట్టు.

"దిగేదాకా అలసటగానే వుంది. ఎప్పుడు చేరుతానాఅని తహతహ.... యిప్పుడు అలసటలేదు" అంది.

"గుడ్!" అన్నాడు శేఖర్. కాని, ఓవర్‌బ్రిడ్జిదిగి కారుదగ్గరకి చేరేసరికి సారధినీ, లావణ్యనీ చూసేసరికి అతను కొంచెం తికమకపడ్డాడు. లావణ్య బుకే తెచ్చింది. పరస్పర పరిచయాలు కాగానే "సారీ ఆయనవొచ్చేసరికే ఆలస్యం అయింది. ఈ రైలు టైముకి ముందు వొచ్చేసింది. లేకపోతే మిమ్మల్ని ప్లాట్‌ఫామ్ మీదనే రిసీవ్ చేసుకునేవాళ్ళం" అంది లావణ్య.


## తెలుగు పుస్తకాలు

| | |
|---|---|
| 150 కుటీర పరిశ్రమలు | రు. 10-00 |
| అతివినోద హాస్యకథలు | రు. 10-00 |
| కామసూత్రాలు | రు. 10-00 |
| దాంపత్య రహస్యాలు | రు. 10-00 |
| గర్భం-గర్భనిరోధం (బొమ్మలతో) | రు. 10-00 |
| ఇంగ్లీషు వైద్యం అన్ని రోగాలకి | రు. 25-00 |

4 పుస్తకములకు పోస్టేజి ఉచితం.

**ఉషా బుక్ సెంటర్,**

గాంధీనగరం, తాడేపల్లిగూడెం (A. P.)




బ్రాంచి: సూర్యారావు గుడివద్ద,తెనాలి,ఫోన్: 551


"థేంక్స్" అంది ప్రియంవద.

"అనవసరంగా శ్రమపడ్డారు"అన్నాడు శేఖర్.

"సరే-పదండి.... అమ్మాయి స్నానం అదీచేసి అతన్ని తీసుకుని మన యింటికి వొస్తుంది....భోజనంచేసి వెళ్తారు" అంది లావణ్య.

"వద్దండీ....అదేం అవసరంలేదు" అన్నాడు శేఖర్. ఈ తియ్యటి తొలినిమిషాలని అతను అక్కడ గడపదలచుకోలేదు.

"ఏమిటోయ్ ఆ కబుర్లు! రైలు దిగిందో లేదో వంట ఇల్లు అప్పచెబుతావా! లావణ్య అన్నీ వండి వుంచింది. వేరే చెప్పనక్కర లేదని ఊరుకున్నాను పద.... గంటలో వచ్చి...." అని తన కారువైపు నడిచాడు సారధి లావణ్య కూర్చోగానే వెనక్కివచ్చి రహస్యంలాగ "నువ్వెంత త్వరగా వస్తే అంత త్వరగా వెళ్ళవచ్చును. అంచాత ఆట్టే ఆలస్యం చెయ్యకు!" అని వెళ్ళిపోయాడు.

ఇంటికి చేరేదాకా శేఖర్ మాట్లాడలేదు.

ఇల్లు చేరి చుట్టూ తిరిగి చూసి "బాగుందండీ ఇల్లు!" అంది ప్రియంవద.

"వెళ్ళి స్నానం చేసిరా. అక్కడికి వెళ్ళక తప్పదు" అన్నాడు శేఖర్.

"బాధపడతారేం?.... పాపం! ఆప్యాయంగా పిలిచారుగదా!" అంది ప్రియంవద - చిరునవ్వుతో, అమాయికంగా.

"ఏం కాదులే! నీకు శ్రమ అని...."

ఆమె తెమిలివొచ్చేసరికి గంట పైగానే పట్టింది. కాని, ఆ కాలం అంతా సద్వినియోగం అయింది అనిపించింది ఆమెని చూసి, శేఖర్‌కి. ఒక్కసారి చేతుల్లోకి తీసుకున్నాడు. "ప్రియా!" అన్నాడు.

ప్రియంవద మాట్లాడలేదు. విశ్రాంతి తీసుకుంటూన్నట్టు రెండు నిమిషాలు అలాగే వుండి, అతని చేతులు విడిపించుకుని, సున్నితంగా అతన్ని దూరంగా తోసి, "చూడండి! మళ్ళీ తల సరిచేసుకోవాలి!" అంది.

"వొద్దులే! అలాగే బాగున్నావు. పద" అన్నాడు శేఖర్. ఆ రెండు నిమిషాలూ అతనికి స్వర్గంలో వున్నట్టు వుంది. ఈ జీవితం అతను ఊహించిన దానికన్నా వెచ్చగా, తియ్యగా వుంది.

లావణ్య చాలా మర్యాదచేసింది.

వంట బాగుంది. కాని, చల్లగా వుంది. శేఖర్ భోజనప్రియత్వం ఆ రోజు సెలవు తీసుకున్నట్టు వుంది. అతను భోజనం ఎక్కువ తినలేకపోయాడు.

"ఆయన ఏమీ తినలేదు" అంది లావణ్య, చిరునవ్వుతోనూ చిన్న బాధతోనూ.

"ఆకలి లేదు కాబోలు" అన్నాడు సారధి.

"ప్రియంవద సరే సరి!" అంది లావణ్య.

"అదే కారణం అయివుంటుందిలే!" అన్నాడు సారధి.

"ఆ వేళలాగ వంట రాలేదండీ ఇవేళ! సారీ!" అంది లావణ్య.

"వంట అద్భుతంగా వుందండి! రైల్లో కూర్చుని అవీ.ఇవీ తినడంతో- ఆకలి పోయింది. అంతే" అంది ప్రియంవద.

ఇంటికి చేరేసరికి పది దాటింది.

తరవాతి రెండు రోజులూ సెలవు పెట్టేశాడు శేఖర్. ఆదివారం కలిసి వచ్చింది.

సోమవారం ఆఫీసు టైముకి ఎలాగో వంట పూర్తి చేసింది ప్రియంవద. ఇప్పటిదాకా వంట అవసరం అంత కలగలేదు. ఒక్కసారి మాత్రం టిఫిన్ చేసింది దోసెలు. అంత బాగా లేకపోయినా "చాలా బాగున్నాయి ప్రియా!" అన్నాడు.

భోజనానికి కూర్చున్నాడు శేఖర్. అన్నం, పప్పు, కూర, సాంబారు- చట్నీలు-ఆమె వొస్తూ చాలా తెచ్చింది. - గోంగూరా, ఊరగాయలూను.

వొండినవి అన్నీ వేడివేడిగా ఉన్నాయి- ఆవిర్లు వొచ్చేస్తూ.

కాని అన్నం సరిగా ఉడకలేదు. కూరలో ఉప్పు ఎక్కువ... సాంబారు మరీ విచిత్రంగా తయారైంది.

శేఖర్ ఏమీ అనలేదు.

'కనీసం వేడిగాఉంది.' అని సంతృప్తిపడి, ఎలాగో తిని వెళ్ళిపోయాడు. వెంటనే వంటమనిషి కోసం ప్రయత్నించాలి అని మరొకసారి అనుకున్నాడు దారిలో. ఇద్దరు ముగ్గురుకి అర్జెంట్ మెసేజెస్ ఇచ్చాడు ఆఫీసుకి చేరగానే.

ఆ సాయంత్రం కూడా అలాగే వొండింది ప్రియంవద. హోటలుకి పోవాల్సింది అనుకున్నాడు. కాని, ప్రియంవదని చూసేటప్పటికి అతను మళ్ళీ సంతృప్తిపడ్డాడు. ఆమె లావణ్యలాగ వొండలేకపోవొచ్చును. కాని, కనీసం వేడి వేడిగా పెడుతుంది.

భోజనాలు కాగానే ఆకులుతెచ్చి అతనికి అందిస్తూ, "మధ్యాహ్నం ఒక మనిషి వొచ్చిందండీ!" అంది ప్రియంవద.

"ఎవరు?" అన్నాడు శేఖర్.

"ఏదో పేరు చెప్పిందండీ!....వంట చేస్తానంది."

"గుడ్. ఎప్పటినించి రమ్మన్నావు ?"

"అసలు రావొద్దన్నాను...."

"ఏం ?" అన్నాడు శేఖర్ అశ్చర్యంగా.

"ఇద్దరం వున్నాం... ఆ మాత్రం చెయ్యలేనా ?" అంది ప్రియంవద.

"అది కాదు ప్రియా !.... అసలు నీ కెందుకీ శ్రమ ?"

"శ్రమ ఏంవుంటండీ? మీరు ఉద్యోగం చెయ్యడంలేమా? అలాగే నాకూ ఈ పనేనా వుండాలికదా !.... పోనీ - మీకు నా వంట నచ్చకపోతే—"

"అబ్బే! నీ వంటకేం? బ్రహ్మాండంగా వుంది. అందుక్కాదు నేనంటూన్నది" అన్నాడు శేఖర్ తొందరగా.

"మీకు నా వంట బాగానే వుందా?"

"నువ్వేం చేసినా నాకు బాగానే వుంటుంది ప్రియా !"

"మరైతే మనకి వంట మనిషి ఎందుకండీ? - డబ్బు వేస్టు అనేకాదు - మరో పరాయి మనిషి ఇంట్లో తిని తిరుగుతూంటే నాకు ఎలాగో వుంటుంది. కాని - మీరు కాదంటే మీ ఇష్టం" అంది ప్రియంవద. ఒక ఆకు చిలకచుట్టి అతని నోటికి అందిస్తూ.

గుండెల్లో రాయి పడింది శేఖర్‌కి. ప్రియలో ఏలోపమూ లేదు. మిగిలిన విషయాల్లో తానుకన్న కలలన్నిటికన్నా తియ్యగా, వెచ్చగా జీవితం సాగిపోయే లాగవుంది ఆమె ప్రవర్తన. ఆమెని ఏ విధంగానూ నిరుత్సాహపరచడం అతనికి యిష్టంలేదు. కాని నాయర్ తరవాత ఈ భోజనం.

"ఏమిటంతగా ఆలోచిస్తున్నారు ?" అంది ప్రియ-అతనికి దగ్గరగా జరిగి.

"ఏమిలేదు. నీకు అందం, ఆప్యాయతతో బాటు యింత తెలివితేటలుకూడా యిచ్చిన ఆ దైవాన్ని మెచ్చుకుంటున్నాను" అన్నాడు శేఖర్.

"మీరు మంచివారండీ !" అంది ప్రియ.

శేఖర్ ఆమెని యింకా దగ్గరగా తీసుకున్నాడు. హాయిగా. వెచ్చగా వుంది.

"మీకు కావలసినవన్నీ వేడి వేడిగా వొండి పెడతాను. మీకు బెంగ అక్కర లేదండీ !" అంది ప్రియ అతని జుత్తుతో సున్నితంగా ఆడుకుంటూ.

అవును.

ప్రియ ఫ్రిజ్‌లోనించి తీసినట్టు వుండదు.

ఆమె చేసిన వంటా అలాగ వుండదు.

రుచులకేం ! అవి రకరకాలు-మనిషికో రుచి.

వేడికూడా ఒక రుచే ! తనకి- యిప్పుడు యింక యెప్పుడూను.

శేఖర్ యింక ఏమీ మాట్లాడలేదు. ●



చర్మవ్యాధులకు,
రాఘ్వాల్®
(పైపూతకు మాత్రమే)
తామర, గజ్జి, దురద, యిస్పరు, తొడలయందు దురద; కాళ్లలో
ఒరికాళ్ళు, ఒరివేళ్లు, వరుప్పలు, పగులుట, మొస్సను.
అన్నిషాపులయందు లభించును
తయారు:- శ్రీ రామ ఆయుర్వేద నిలయం (Regd)
కత్తిపూడి (వయా) చేబ్రోలు తూ॥గో॥జిల్లా (ఆం॥ప్ర)

శ్రీకాకుళం. విజయనగరం. వైజాగ్. తూర్పు. పశ్చిమ గోదావరి జిల్లాలకు మినహా మిగతా జిల్లాలలో స్టాకిస్టులు కోరబడుచున్నారు.

ఇంజనీరింగ్ డిప్లొమ హోల్డర్సుకు సదవకాశం

మీరు రెండు సంవత్సరాలలో గవర్నమెంటుచే B. E. డిగ్రీకు సమానముగా రికగ్నయిజ్ కాబడిన A. M. I. E. అర్హతను కరస్పాండెన్సు ద్వారా పొందుటకు రివైజుడ్ స్కీము ఏర్పడియున్నది. వివరములకు రూ. 5/- ఎం. ఒ. చేయండి.

ఎన్. టి. జ్ఞానప్రకాశం, M.E.,M.I.E. ప్రిన్సిపాల్

సర్కారు ఇంజినీరింగు కాలేజి

మచిలీపట్నం-521 001 (A P)

Cinni

A SYMBOL OF QUALITY



TABLE & CEILING FANS



A product of National Winder, Varanasi-1
Marketed by:
Sah Agencies, Varanasi-1

Sole Distributors for South India:

ahuja enterprises
B. V. K. Iyengar Road, P.B. No. 7931
Bangalore-560 053 Phone: 74713 72221